క్లుప్తంగా

సమ్మయ్యకు సత్కారం



దేవరుప్పుల: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ అనురాగ్ యూనివర్సిటీ సినర్జి–2024 వార్షికోత్సవంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను ఘనంగా సత్కరించారు. ఆదివారం నిర్వహించిన వేడుకల్లో సమ్మయ్యను యూనివర్సిటీ బీసీ ప్రొఫెసర్ రాంచంద్రం, రిజిస్ట్రార్ డాక్టర్ బాలాజీ ఊట్ల, సీఈఓ నీలిమ, డీన్లు డాక్టర్లు ముత్తారెడ్డి, విజయ కుమార్, విష్ణుమూర్తి, సుధీర్‌రెడ్డి, సతీష్ కుమార్, లక్ష్మి ప్రసన్న, నారాయణరెడ్డి, వసుధ, ఎమ్మెల్యే పల్లారాజేశ్వ ర్‌రెడ్డి, నిర్వాహకులు ప్రొఫెసర్ శ్రీనివాస చలపతి సన్మానించారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ప్రవీణ్



జనగామ: తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నూతి శ్రీకాంత్ గౌడ్‌ను జిల్లా ఓబీసీ చైర్మన్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఆయనతో మాట్లాడారు.

అభినందనలు



పాలకుర్తి: రాష్ట్ర స్థాయి పదవులు పొందిన నూతి శ్రీకాంత్ గౌడ్, నగరి ప్రీతంలను ఓబీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పులి గణేష్ ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిషలు కృషి చేసిన ప్రీతం, శ్రీకాంత్‌గౌడ్‌లను గుర్తించి ఎస్సీ, బీసీ కార్పొరేషన్ పదవులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చేయూత



దేవరుప్పుల: మండలంలోని చౌడూరు గ్రామానికి చెందిన అమృతం వెంకటేశ్వర్లు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఒక కిడ్నీ పూర్తిగా చెడిపోగా మరొకటి 60 శాతం మాత్రమే పని చేస్తోంది. దీంతో అతడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న 1996 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు స్పందించి రూ.70,500 అతడికి అందజేశారు. వైద్య ఖర్చులకు ఇంకా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ధైర్యంగా ఉండాలని స్నేహితులు గోడిశాల శ్రీనివాస్, జొన్న సంతోష్, బాషెట్టి శేఖర్, వెంకటేశ్వర్లు.. అతడికి, కుటుంబ సభ్యులకు సూచించారు.

నరేష్ మృతి తీరని లోటు



దేవరుప్పుల: మండంలోని కామారెడ్డి గూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పులిపంపుల నరేష్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం నరేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అయన వెంట నాయకులు ఓడపల్లి రవీందర్, పుల్లయ్య, భూక్య సజ్జన్,పాండు, రమేష్, యాదవరెడ్డి, రాజు, రమేష్, చారి, కొమురయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఎంపిక



నర్మెట: కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా కన్నెబోయిన గూడెం మాజీ సర్పంచ్ రాజబోయిన లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేదిశగా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బండి అశోక్, బైరగోని సురేందర్, పండ్ల బాలనర్సు, సరాబు మధు, బైరగోని లక్ష్మణ్, అంగోత్ రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జఫర్‌గఢ్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్: సమ్మేళనంలో పాల్గొన్న 1987–88 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ఉన్నత పాఠశాలలో 1978–79 పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు తమ్మడపల్లి (ఐ) గ్రామంలోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 46 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. పూర్వవిద్యార్థులు చిలువేరు రవీందర్, జయసింహారెడ్డి, నాగార్జున ప్రసాద్, తోట భాస్కర్, పద్మ, పిచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాటికొండలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 36 ఏళ్ల క్రితం కలిసి పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 1987–88 విద్యాసంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మూడున్నర దశాబ్దాల అనంతరం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. తాము చిన్ననాడు చదువుకున్న పాఠశాల పరిసరాలను చూసి మురిసిపోయారు. ఒకరికొకరు కరచాలనం, ఆలింగనాలు చేసుకుంటూ చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. స్నేహితులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. ఒకరినొకరు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అక్కినపెల్లి అంజయ్య, ఏదునూరి వెంకట్రాజ్యం, బాశెట్టి హరిప్రసాద్, నీల యాదగిరి, బేతి మంజుల, రేణుక, రమాదేవి, సుల్తానా, చంద్రశేఖర్, సాంబయ్య పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రామగళ్ల తదితరులు

జనగామ: సబ్బండ వర్గాల అభివృద్ధికి కులాల వారిగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, సహకారం అందించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం పార్టీ రాష్ట్ర నాయకుడు రామగలల పరమేశ్వర్ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ల ఏర్పాటు రాజకీయం కోసం కాదని, ప్రజా పాలనలో తీసుకున్న నిర్ణయమన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఓబీసీ ప్రసిడెంట్ తూము వినయ్ కుమార్, వైస్ ప్రసిడెంట్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వేడుకగా తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న తహసీల్దార్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా మొదటి రోజున అధ్యాయన మహోత్సవం(తొళ్లక్కం), ద్రావిడ ప్రబంధ సేవాకాలం పూజలు చేపట్టారు. మొదటి రోజు ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కలకోట రామానుజచార్యులు మాట్లాడుతూ తిరుమలనాథ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 26 వరకు ఉంటాయని, స్వామివారి కల్యాణం ఈనెల 23న(శనివారం) నిర్వహిస్తామన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.516 చెల్లించాలని, కల్యాణం, హోమంలో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తులలో రావాలని ఆయన కోరారు.

గుడిసెలు వేస్తే కేసులు తప్పవు



గుడిసె వాసులతో మాట్లాడుతున్న ఎస్సై సతీష్

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని 174 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా గుడిసెలు వేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై కంకల సతీష్ హెచ్చరించారు. ఆదివారం గుడిసెవాసులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రానున్నందున తీవ్రమైన చర్యలు ఉంటాయని అన్నారు. ప్రభుత్వ భూమిని ఇళ్లు లేని నిరుపేదలకు రెవెన్యూ అధికారులు పట్టాలు అందిస్తే ఇంటి నిర్మాణాలు చేపట్టవచ్చని తెలిపారు. అప్పటి వరకు ఎవ్వరూ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయొద్దని చెప్పడంతో గుడిసె వాసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ పర్వతం నర్సింహులు, తరిగొప్పుల ఎస్సై శ్వేత, నర్మెట ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్, ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, పోలీసులు ఉన్నారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం..



మాట్లాడుతున్న సారయ్య

పాలకుర్తి: అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దామని సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు గ్రామంలో బెల్లి సంపత్ అధ్యక్షతన నిర్వహించిన నక్క రాజయ్య సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీబలోపేతం కోసం, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రైతులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన రాజయ్య మృతి తీరని లోటని అన్నారు. నాయకులు సాదం రమేష్, సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, సుధాకర్, పనికిరాని రాజు, నాయని శ్రీనివాస్, మచ్చుపాడు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

జనగామ: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా వివేకానంద సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఆదివారం ట్రస్టు ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్ చేతుల మీదుగా పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ట్రస్టు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తూ, హాని కలిగించే విధంగా చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు యాదగిరి రెడ్డి, గుగ్గిల మహేష్, రవికుమార్, రాజు, బాల్ నర్సయ్య, సత్యనారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల కమిటీ ఎన్నిక



నర్సిరెడ్డి, అధ్యక్షుడు

జనగామ: జనగామ కాంగ్రెస్ మండల నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా లింగాల నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాజే అనిల్, ఉపాధ్యక్షులుగా బన్సీ నాయక్, సంకటి యాదగిరి, మెరుగు రాజేందర్, కొమ్ము బాలనర్సయ్య, కార్యదర్శిగా తొట్టె, నరేందర్, తాండ్ర రాములు, కాసర్ల నాగయ్య, రమావత్ తులసీరామ్, సహాయ కార్యదర్శులుగా రెడ్డబోయిన రవీందర్, జినుకాల రాజు, మల్లారెడ్డి కృష్ణారెడ్డి, నామాల రాములు, కోశాధికారిగా కాల్నె ఉప్పలయ్య, అధికార ప్రతినిధులుగా సింగరి రవీందర్, కట్ట కృష్ణ, చామకూర చిరంజీవి, సుధగాని కృష్ణ, ఈసీ మెంబర్లు గుంటిపల్లి భారతమ్మ, వై.యాదగిరి, పిడుగు సుదర్శనం, బైన శ్రీలత, ఎ.శ్రీనివాస్, అంబాల సంపత్, ఒరుగంటి నర్సింహ, తేజావత్ నర్సింహ, షేక్ యాకూబ్ ఎన్నికయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో అండగా నిలువాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. నాయకులు సర్వల నర్సింగరావు, ధర్మ గోవర్ధన్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్, ఎంపీటీసీ మెరుగు బాలరాజు, గొలుసుల దుర్గేష్, మహేందర్‌రెడ్డి, బనుక ప్రభాకర్, గువ్వ సత్యనారాయణ, లింగాల వెంకట్ రాంరెడ్డి, ప్రకాష్ అరవింద్, బాలకృష్ణ, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బచ్చన్నపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని, నియోజకవర్గానికి గోదావరి జలాల రాకతో రైతుల కళ్లలో ఆనందరం వెల్లి విరిసిందని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ నూకల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎద్దుగూడెం మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ యువ నాయకులు ఎద్దు హరీశ్ పుట్టిన రోజు సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలువగా స్వీట్ తినిపించి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతో గోదావరి జలాలు వచ్చాయని ఇక పంటలు ఎండిపోవని అన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జంగిటి నరేష్, ఈదులకంటి వెంకట్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య, బనుక శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శివకుమార్‌గౌడ్

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మల్ల సాయిలు మృతి చెందాడు. కాగా సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కర్రె చెంద్రయ్య, ఎంటి శ్రీనివాస్, చీర సత్తయ్య, కొమురయ్య, మహేందర్, మల్ల నాగులు, ఐలయ్య, కొమురయ్య, తేలు కిష్టయ్య పాల్గొన్నారు.

రాజవరంలో..

చిల్పూరు: రాజవరం గ్రామానికి చెందిన ఎడ్ల యాకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. చిల్పూరు ఆలయ డైరెక్టర్ జక్కుల రాజశేఖర్, నల్ల ఎల్లయ్య, జక్కుల రాజయ్య, కర్ణాల శ్రీనివాస్, కుమార్, మెగిళి, రాజు, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన చల్లా సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కుతుబుల్లాపూర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ కొలను హనుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఆదివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన చల్లా సుధీర్‌రెడ్డి ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ వైస్ ఎంపీపీగా ఉండగా అతడి భార్య చల్లా ఉమాసుధీర్‌రెడ్డి తాటికొండ సర్పంచ్‌గా ఉన్నారు. గతంలో ఆయన హైదరాబాద్ ప్రగతినగర్ ఉపసర్పంచ్‌గా పనిచేయగా ప్రస్తుతం అతడి కుమారుడు ఇంద్రజిత్‌రెడ్డి ప్రగతినగర్ కార్పొరేటర్‌గా ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో పట్టు ఉన్న సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడటం ఆ పార్టీకి పెద్ద దెబ్బగానే చెప్పుకోవాలి. త్వరలో అతని బాటలో తాటికొండ గ్రామం నుంచి, ఘన్‌పూర్ మండలం నుంచి పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు బాగా ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితుడనై ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఏది ఏమైనా ప్రస్తుతం వైస్ ఎంపీపీగా ఉన్న సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరడం మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది.

'ఏకశిల'లో చెస్ పోటీలు



చెస్ విజేతలతో కళాశాల డైరెక్టర్, నిర్వాహకులు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

జనగామ: పట్టణానికి చెందిన గుడాల భూమయ్య జ్ఞాపకార్థం ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం చెస్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పోటా పోటీగా తలపడ్డారు. ఇందులో 20 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిత్ర ఉపేందర్‌రెడ్డి, నిర్వాహకులు, ఉపాధ్యాయులు మాధవి, కాసాల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి



తరిగొప్పుల : మండలంలోని బొత్తలపర్రె గ్రామానికి చెందిన ఉడుత ఐలయ్య శనివారం సాయంత్రం తన పొలంలో దూడను కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా దూడ మృతిచెంది కనిపించింది. శనివారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో దూడ మృతిచెందిందని బాధిత రైతు తెలిపారు.

మత్తడికి మరమ్మతులు చేయండి



పగుళ్లు పడిన మత్తడిని చూపుతున్న రైతులు

రఘునాథపల్లి: కొత్త చెరువు మత్తడికి వెంటనే మరమ్మతులు చేయాలని మండలంలోని ఖిలాషాపూర్ రైతులు ఆదివారం పగుళ్లు పట్టిన మత్తడి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మత్తడి పగుళ్లు పట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో వర్షాలు కురియగానే బుంగపడి వచ్చిన నీరు వచ్చినట్లే పోతుందని తెలిపారు. భారీ వర్షాలు పడితే ఈసారి మత్తడి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, దీని వలన మత్తడి కింద ఉన్న పొలాలలతో పాటు ఒడ్డెర కాలనీ, మాదారపు గ్రామ ప్రజలకు ప్రాదం జరిగే అవకాశం ఉందని అన్నారు. తక్షణమే మత్తడికి మరమ్మతులు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు.

'కళాకారులను ఇబ్బందులకు గురిచేస్తున్న జెడ్పీటీసీ'



మాట్లాడుతున్న ఒగ్గు రవి

లింగాలఘణపురం: జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఒగ్గడోలు కళాకారులను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకొని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఉస్తాద్ ఒగ్గడోలు కళాకారుడు ఒగ్గు రవి, కురుమ సంఘం మండల ప్రచార కార్యదర్శి కొడె ఒనేశ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో కురుమ సంఘం భవనంలో విలేకరులతో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో ములుగు ఎన్నికల ప్రచారంలో 325 మంది ఒగ్గడోలు కళాకారులను ప్రచారంలో వాడుకున్నారని, వీరికి రూ.9.75లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.6 లక్షలు ఇచ్చాడని, అదేవిధంగా కొడ ఒనేశ్ కళాకారులకు రూ.3 లక్షలకు బదులుగా రూ.1.50 లక్షలు ఇచ్చి మిగిలిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. వీరితో పాటుగా కళాకారులు కడకంచి పాపయ్య, గొరిగె నీల, కడకంచి కావ్య, ఇక్కిరి మధు, గడ్డం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కావాలని బద్నాం చేస్తున్నారు..

ఒగ్గు కళాకారులను ఎన్నో కార్యక్రమాల్లో ఉపయోగించుకున్నామని, ప్రతి కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.2వేలు మాత్రమే ఇచ్చామని, ములుగు ప్రచారంలో కూడా 300 మందిని పిలిచి రూ.6 లక్షలు ఇచ్చామని, కావాలని ఒగ్గు రవి బద్నాం చేస్తున్నాడని జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. మండలంలోని కళాకారులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామని, ఒగ్గు రవి ఇతర జిల్లాలోని కళాకారులను పిలిపించి ఏజెన్సీ మాదిరిగా వ్యవహరించి బద్నాం చేస్తున్నాడని అన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



చిల్పూరు: నెల 16 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరవడంతో పాటు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా బందోబస్తు నిర్వహించాలని ఆదివారం రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌యాదవ్, స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్‌లను వేర్వేరుగా ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ధర్మకర్తలు సంగోజు మోహనాచారి, గాజుల రజని, పుట్ట కిరణ్‌రెడ్డి, నారాయణ, జక్కుల రాజశేఖర్, మధు, నారాయణరెడ్డి, బాలరాజు, గట్టు ఎల్లయ్య, మల్లేషం, సత్యనారాయణ, వికాష్‌రెడ్డి, గణేష్, తౌటి సునీల్, మర్రి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం

బచ్చన్నపేట: రామచంద్రాపూర్ గ్రామంలో రేపు (ఈ నెల 19న) వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ఊపిరి తిత్తులు, గుండె, శ్వాస సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రేలు తీయనున్నట్లు చెప్పారు. రామచంద్రాపూర్ గ్రామంలోని రైతు వేదిక భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు నిర్వహించే వైద్య శిబిరాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, సభ్యుడు ఆముదాల భూపాల్‌రెడ్డి ఉన్నారు.

గ్రామాల్లో 'జాజరి' సందడి



బచ్చన్నపేట: హోళీ పండుగను పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో చిన్నారులు కోలలతో జాజిరి ఆడుతూ సందడి చేశారు. ఈ నెల 25న తేదీన హోళీ పండుగ ఉండగా వారం రోజుల ముందు నుంచి రాత్రి వేళ చిన్నారులు కోలలతో జట్లుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటికి వెళ్లి జాజిరి ఆడి వారు ఇచ్చింది తీసుకుంటున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పూర్తి చేయండి

లింగాలఘణపురం: మండలంలోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను పూర్తి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి కోరారు. గ్రామాల్లోని గ్రామైక్య సంఘాల అధ్యక్షురాలు కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ఉంటారని. ప్రతి క్లాస్‌లో ముగ్గురు తల్లులు లేదా సంరక్షకులు ద్వారా సభ్యులుగా ఉన్నవారిని మాత్రమే నామినేట్ చేయాలని సూచించారు. వీరిలో కనీసం ఒక్కరైన ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారై ఉండాలి. పదవీ కాలం రెండేళ్లుగా ఉంటుందని, ఒకవైళ విద్యార్థి పాఠశాల నుంచి వెళ్లిపోతే కమిటీ నుంచి తొలగించబడుతారని తెలిపారు. ఒక గ్రామంలో ఎక్కువ వీఓఏలు ఉంటే రోటేషన్ పద్ధతిలో చైర్‌పర్సన్లుగా కొనసాగుతారని, ఈ కమిటీ ఆధ్వర్యంలోనే పాఠశాల అవసరాలకు సంబంధించిన పనులు చేస్తారని, అందుకు కమిటీలోని 50 శాతం సభ్యుల తీర్మానాలు తప్పనిసరిగా ఉండాలని, కమిటీ ఎన్నిక జరిగిన వెంటనే బ్యాంకు అకౌంట్లు హెడ్మాస్టర్, అధ్యక్షురాలి పేరుతో తీయాలని సూచించారు.